# మధుర స్మృతి

## మాదిరెడ్డి సులోచన

లావణ్య టేప్ రికార్డర్ పెట్టుకుని పాటలు వింటుంది. ఆమెకు ఘంటసాల పాటలంటే చాలా ఇష్టం. ఆ ఇష్టం ఇప్పుడు కాలక్షేపానికి పనికివస్తుంది.

"అమ్మగారూ! భోజనానికి వస్తారా? అయ్యగారికి రాత్రి రిడ్జ్‌హోటల్లో పార్టీ ఉందట ...." పని కుర్రాడు వచ్చి పిలిచాడు.

"పార్టీయా?"అన్నది ప్రాణంలేనట్టు.

ప్రతి రోజూ ఏదో ఒక పార్టీ, ఏదో ఫంక్షన్. తననూ రమ్మంటాడు భర్త కాని తనా పార్టీలలో ఇమడలేదు.

"ఆకలి లేదు రంగా! వంటామే, నువ్వూ భోజనంచేసి పడుకోండి," అన్నది. తన కంటిలో ఊరిన నీరు రంగడి కళ్లల్లో పడకూడదని ముఖం ఇటు తిప్పుకుని –

రంగడు వెళ్ళిపోయాడు.

"కల కానిదీ ... విలువయినదీ...." ఘంటసాల కంఠమునుండి విషాదంలో తేనెలూరుతున్నాయి.

"నాకు మాత్రం కలగానే మిగిలిపోయిందీ జీవితం...." అనుకుని కళ్ళు తుడుచుకుంది.

"అమ్మాయ్! ఆకలి లేదన్నావుట" వంటామె వచ్చింది ఆమె భర్త చంద్రశేఖరానికి దూరపు బంధువుట. అందరితో చనువుగా ఉంటుంది.

"అవునండీ" అన్నది ఏమనాలో తెలియక.

"చూడమ్మా! చంద్రం బాబు మొదటినుండి అంతే. తన వ్యాపారంపై ఉన్న శ్రద్ధ ఇంటిమీద ఉండదు. కోమలమ్మ బ్రతికి ఉండగా యెంత గొడవ పడేదో. అతని ధోరణి అతనిది. లేచి భోజనం చెయ్యి" అన్నది చనువుగా.

"పద...." టేప్ రికార్డర్ ఆఫ్ చేసి వెళ్ళింది. వంటావిడ వడ్డిస్తే రెండు ముద్దలు తిని లేచింది. మళ్ళీ తన గదిలోకి రాగానే కడుపులో ఏదో భయం, ఒంటరితనం భయంకరంగా అనిపించింది.

ఆ ఇల్లు ఒక భూతగృహంలా, ఆ ఇంట్లోని వస్తువులన్నీ పిశాచాల్లా కనిపించాయి.

తనీ నిశబ్దం భరించలేదు.

తనీ ఒంటరితనం అనుభవించలేదు.

స్వయంకృతం యెవరేం చేస్తారు? స్వర్గధామంలాంటి సంసారాన్ని వదులుకుని ఎండమావుల వెంట పరుగెత్తింది.

ఆ రోజులు....ఆ రోజు మరుపురాని మధుర కావ్యంగా, దివ్యస్మృతిలా, కవితావేశంలో రూపొందిన కృతిలా మిగిలిపోయింది. అప్పుడు తనకు పదహారేళ్ళుండేవేమో.

గోపాలరావుతో వివాహం జరిగింది. అతనెవరో కాదు తన తండ్రి పెత్తల్లి మనవడు.

నాలుగెకరాల వరి పొలం, ముప్పై ఎకరాల మెట్ట పొలం ఉందిట, తమ ఇంటికి దగ్గరలోనే డాబా ఇల్లుంది. తల్లీ, తండ్రీ పోయారుట. ఇద్దరు తమ్ముళ్లున్నారు.

మొదటిసారిగా అతను దగ్గరకు తీసుకుని నుదురు చుంబించాడు.

"లావణ్యా అంటె చాలా పెద్దగా ఉంది. నేను మాత్రం వీణా అంటాను" అన్నాడు.

సిగ్గుగా తలవంచుకుంది.

"ఏయ్! నేనంత వికారంగా ఉన్నానా! నా వైపు చూడవు." అన్నాడు గడ్డం పట్టి పైకి ఎత్తుతూ.

తల యెత్తి చురుకుగా చూడబోయింది. అతను పక పక నవ్వి తన ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు.

"వీణా! ఈ ఇంటి బాధ్యత, నా బాధ్యత నీ చిన్నారి వయసుకు బరువయినవే. అయినా తప్పదు."అన్నప్పుడు....

తను జవాబు చెప్పలేక, అతని హృదయంలో తల దాచుకుంది. ఆ రాత్రంతా స్వీట్ నథింగ్స్‌తో కాలం గడిచింది తెలియలేదు. తెల్లవారి బారెడు పొద్దెక్కాక ఉలిక్కిపడి ఇద్దరూ లేచి బయటికి వచ్చారు. అక్కడి దృశ్యం చూచి లావణ్య నవ్వు ఆపుకోలేకపోయింది. ఇద్దరు మరుదులు వేణు, మధు లుంగీ పంచెలు యెగచెక్కి, ఒకరు పూరీలు చేస్తుంటే ఒకరు కాలుస్తున్నారు. వంటిల్లు పిండి చల్లినట్టుంది.

"అరే....రే వదినా చెప్పి నవ్వితే నీ నవ్వుల్లోని పువ్వులు ఏరుకునేవాడిని" వేణు వెక్కిరించాడు.

"అరే వదిన నవ్విందా? నేను పగలు వెన్నెలలు కురుస్తున్నా యేమిటనుకున్నాను." మధు నవ్వాడు.

"చాల్లెండి కవిత్వం! నన్ను లేపొద్దా?" అన్నది దొడ్లోకి వెడుతూ.

ముగ్గురన్నదమ్ములఆరాధన....ఆప్యాయతలో సర్వం మరిచిపోయింది తను.



వేణు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మధు ఇంటర్ చదువుతున్నాడు.

"మా అందర్లో గోపి అన్నయ్యే క్లెవర్. నాన్నగారు పోవటంతో చదువు ఆపాడు." అనేవారు మరదులు.

కాలేజీలు తీసాక వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

తనూ, గోపి మిగిలారు. గోపి బయట యెంత గంభీరుడో ఇంట్లో అంత అల్లరి. సాయంత్రం వచ్చేటప్పుడు బావికట్టు చెట్టునుండి పూలు తెచ్చేవాడు. అవన్నీ ఆడపిల్లలా చక చక అల్లి తన తలలో పెట్టేవాడు. భోజనం చేస్తుంటే అదే అల్లరి, నీ కంచంలో ముక్కలు బాగా వేగాయని, నీ పెరుగులో ఎక్కువ మీగడ ఉందని కంచానికి కలియబడేవాడు. ఒక్కరోజు పుట్టింట్లో ఉంటే పదిసార్లు కబురు చేసేవాడు. అమ్మ, నాన్న ముసి ముసిగా నవ్వుకున్నారు.

కలలాంటి జీవితం గడుపుతుండగానే ఒక్క సంవత్సరం గడిచిపోయింది. లావణ్య అన్న రామ్మోహన్ పట్నంలో చదువుతున్నాడు. మధ్యలోనే వచ్చాడు. తన క్లాసుమేటును ప్రేమించాడట. పెళ్ళి చేసుకుంటానని. తల్లి తండ్రులు ఓ నిట్టూర్పు వదిలి, వివాహానికి అంగీకరించారు. వివాహం క్లుప్తంగా ముగిసింది.

అందరూ ఊరు వెడుతుంటే, సాయంత్రం రిసెప్షను ఉన్నా ఉండమన లేదు అన్నగారు. అతని అత్తగారి బంధువులంతా నాగరికులని అతని అభిప్రాయం.

"మరీ దిక్కులేనట్టు ఒక్కడు ఎలా ఉంటాడు? లావణ్య ఉంటుంది" అన్నది తల్లి. గోపి అయిష్టంగా తనను అన్నతో పాటు వదిలాడు.

"వీణా! రేపు ఉదయం బస్సులో రాక పోతే ఊర్కోను" బెదిరించి చుట్టూ యెవ్వరూ లేరని గ్రహించాక, బుగ్గపై గాఢంగా చుంబించి వదిలాడు.

రామ్మోహన్ అత్తగారింట్లో అడుగు పెట్టిన లావణ్య మతిపోయింది. ఎటు చూచినా గాజు కిటికీలు, అద్దాల బీరువాలు, మెత్తని తివాచీలు, సిల్కు పరదాలు, దేవేంద్ర భవనంలా ఉంది. తను పుట్టి బుద్ధి యెరిగాక సినిమాల్లో తప్ప నిజజీవితంలో అంత పెద్ద ఇల్లు చూడలేదు.

"లావణ్యా! ఏమిటీ జిడ్డుమొహం! ఇలా రా...."వదిన పిలిస్తే పైకి వెళ్ళింది.

ఆమె గదిలో అడుగుపెట్టి ఆశ్చర్యంగా తనను తాను నమ్మనట్టు, కల గంటున్నట్టు నిలబడిపోయింది.

"ఇదిగో లావణ్యా! సాయంత్రం ఈ బనారస్ చీర కట్టుకుందువుగాని, ఇప్పుడీ పువ్వులు కుట్టిన నైలెక్స్ కట్టుకో. మా బంధువులంతా వస్తారు. యెవరన్నా మీ ఆయన ఏంచేస్తారంటే వ్యవసాయం అనకు. లాండ్‌లార్డ్ అని చెప్పు" అని సలహా యిచ్చారు అన్నావదిన.

అరగంట తరువాత తన రూపం అద్దంలో చూసుకున్న లావణ్య మతి పోయింది. ఏ సినిమాహీరోయినూ తనంత అందంగా లేదన్న నమ్మకం కలిగింది. నేవీ బ్లూ నైలెక్స్‌పై చిన్న, చిన్న గులాబీలు కుట్టిన చీరలో తను యెంతో అందంగా కనిపించింది.

వదులుగా అల్లిన జడ, మెడలో ముత్యాలదండ, ముత్యాల జూకాలు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేసాయి.

రామ్మోహన్ భార్య రాణి అందంగా లేకపోయినా, అలంకారం చేసుకుంటుంది. అందంగానే కనిపిస్తుంది. రాణి బంధులవును చూచి, కళ్ళు తేలవేసింది. ఆ చీరలు, ఆ నగలు, ఆ హంగులు తను మరో జన్మ తపస్సుచేసినా పొందలేదేమో. రాణి మాత్రం లావణ్యను గౌరవంగానే చూచింది. తన ఆడబిడ్డ అంటూ అందరికీ పరిచయం చేసింది. రాణికి లావణ్య అందగత్తె అని వెర్రి అభిమానం. అక్కడే చంద్రశేఖర్‌తో పరిచయం అయింది. అతను రాణికి దూరపు బంధువు పెద్ద బిజినెస్ మాగ్నెట్ అట. అతను వచ్చిన పసుపు రంగు టొయొటా కరోల చూచి మతి

పోయింది లావణ్యకు. అతని భార్య పోయిందట. ఒంటరివాడట.

వారంరోజులకు మనిషి వస్తేగాని తనిల్లు, గోపి, గుర్తుకు రాలేదు లావణ్యకి. స్వర్గం వదిలి రాబుద్ధి కాలేదు. కాని తప్పదు. రాణి తనవి నాలుగు చీరలు ఇచ్చింది. వీలున్నప్పుడల్లా రమ్మని చెప్పింది.

లావణ్య ఊరొచ్చి, వెలిసిపోయిన గోడలు, కలిసిపోయిన రంగుతో తలుపులు దర్శనమిచ్చాయి. ఒక్కసారి స్వర్గంనుండి నరకంలోకి పడ్డట్టు అనిపించింది. మలయమారుతం వీచే చోటు నుండి మంటల్లోకి తోసినట్టు అనిపించింది.

ఆ క్షణంలో నవ్వుతున్న గోపాల్‌ను చూస్తే తన జీవితం నరకం చేసిన నర రూప రాక్షసుడిలా అనిపించాడు.

"వీణా! నేను చెప్పిందేమిటి?" గడ్డం పట్టి ముఖం పైకెత్తుతూ అడిగాడు. విసురుగా జవాబు ఇవ్వబోయింది కాని గొంతు పెకిలి రాలేదు.

"వాళ్ళంతా బలవంతంచేస్తే నేనేం చేయాలి?" అన్నది బేలగా.

"నాకయితే యింటికి రాబుద్ధి కాలేదు. వచ్చినా నువ్వు లేవని మరిచిపోయి వంటింట్లో వెతుక్కున్నాను. యెంత పిచ్చివాడినో చూడు...." ఆమె నడుం పట్టి లేపి, పెదాలు చుంబించాడు.

"ఛీ....ఛీ....ఇదేమిటి? ఈ రంగు కడిగెయ్యి" అన్నాడు, లిప్‌స్టిక్ చూచి,

భర్తమీద విపరీతమైన కోపం వచ్చింది. ఆమెకు ఏ పనీ చేయాలని లేదు. మాటి మాటికి రాణి వైభవమే గుర్తుకువస్తుంది. యెంత అదృష్టవంతురాలు! కూర్చున్న దగ్గరకే నిముషాలపై అన్నీ వస్తాయి.

"అన్నం వండుతున్నావా వీణా" వెంటనే అమాంతంగా ఆమెను లేపి దూరం దింపాడు.



"ఇదేమిటి పనిచేసుకోకుండా?" చిరాకుగా చూచింది.

"ఈ నైలెక్స్ చీరలతో వంటింట్లో పని చెయ్యొద్దు వీణా," హెచ్చరించాడు.

కొనిపెట్టలేని ముఖం అంతకంటే ఏమంటాడు!

ఆమె కా ఊర్లో ఉండాలని లేదు. ఈసారి మరదులు సెలవులకు వస్తే ముభావంగా ఉండిపోయింది. వాళ్ళు కూడా అన్నకు సాయం పొలంవైపే వెళ్ళారు.

మెల్లగా పట్నం మెరుగులు, జిలుగులు పాతబడుతుండగా శ్రావణ మాసంలో మరో మెరుపు మెరిసింది ఆ ఊళ్లో! పుట్టింట్లో తను నోము నోచుకుంటాను రమ్మని పిలువటానికి వచ్చింది రాణి. ఒక్క లావణ్యే కాదు. ఆ చుట్టుప్రక్కల అందరూ ఆమె కట్టిన చీరల నగల అంచనా వేశారు. ఆమె లావణ్యను తప్పక రమ్మని మరీ, మరీ వెళ్ళింది.

"గోపీ! నేనూ అమ్మాయి వెళ్ళొస్తాం నాయనా!"

"మీరు వెళ్ళి రండి. వీణ కూడా యెందుకు!"


"రాణి మరీ, మరీ చెప్పింది." అన్నదామె.

గోపికి రాణి నోము పేరుతో లావణ్యకు కొన్న బట్టలకు రెండువేల దాకా వదిలాయి. లావణ్య నోములకు వచ్చిపదిరోజులయింది. ఈ పదిరోజులు పది క్షణాల్లా గడిచాయి.

"ఏమిటో మన రామ్మోహన్‌ను రాణి అందం చూచి వరించినట్టు, లావణ్యను యెవరయినా చేసుకునేవారు. తొందరపడి పెళ్ళిచేసాము. ఆ అబ్బాయికి తమ్ముల చదువు తప్ప అమ్మాయి విషయమే పట్టదు." అన్న తల్లి మాటలు లావణ్య మనసును చెదరగొట్టాయి.

నిజమే! తన అందం అలాంటిది. రాణిలాంటి లక్షాధికార్ల అమ్మాయి తనను సమంగా గౌరవిస్తుందంటే తన అందమే కారణము.

లావణ్య బుర్రలో ఈ విషయం దూరి ఆమె మానసిక బలాన్ని తొలచి వేసింది.



పట్నంనుండి తిరిగివచ్చిన లావణ్య చీటికి, మాటికి భర్తను విసుక్కుని, మరుదులకు దోచిపెడుతున్నాడని నిందించటం, నిష్ఠూరాలాడటం మొదలు పెట్టింది.

చీటికి, మాటికి అనారోగ్యం పేరుతో హైద్రాబాద్ రావటం మొదలుపెట్టింది. ఆమెకు చంద్రశేఖరాన్ని చూస్తే మతి పోతుంది. కొన్నాళ్ళు సాంప్రదాయాల మధ్య, ప్రగతిశీలత మధ్య మానసిక యుద్ధంజరిగింది ఒకనాడు చంద్రశేఖరం అభిప్రాయం తెలుసుకుందామని తన మనసు బయటపెట్టింది.

"చంద్రశేఖరంగారూ! స్త్రీకి ఈ సాంప్రదాయమనే సంకెళ్ళనుండి విముక్తి లేదా?" అన్నది.

"కాలం మారిపోయింది లావణ్యా! తనకు నచ్చనిచోట ఆత్మను చంపుకుని ఉండమని యెవరూ అనరు. విలువలు మారిపోయాయి." అన్నాడు టేప్‌రికార్డర్ ఆన్‌చేసి పాటలు వింటూ.

అతని హృదయం అర్థంఅయింది. ఆ సాయంత్రమే ఊరుకు వచ్చేసింది. ఆ సాయంత్రం గోపి కోపంగా అడిగాడు.

"వీణా! ఈ రెండు నెలల్లో, నెలపైనే పట్నంలో ఉన్నావ్. నీ మూలంగా నా పనులు నాశనం అవుతున్నాయి."

"అంటే....మీరనేది?"

"ఇకపై ఇక్కడ ఉన్న డాక్టరు దగ్గరే మందుతీసుకో. నువ్వు పట్నం వెళ్తే నేను ఒక్క పైసా ఇవ్వను." అన్నాడు కచ్చితంగా.

"నాకెందుకు ఇస్తారు? ఇద్దరు తమ్ముళ్ళున్నారే రాహూ, కేతుల్లా...." మాటా, మాటా పెరిగింది. ఇద్దరు పోట్లాడుకుని, ఈ విషయం లావణ్య తల్లిదండ్రుల దృష్టికి వెళ్ళింది.

"అతను అన్నది నిజమేనమ్మా. మనఊళ్ళో డాక్టరు లేడా? చీటికి, మాటికి హైద్రాబాద్ వెళ్తే ఏం బావుంటుంది?" తండ్రి మందలించాడు. తల్లి కంఠ్ మన్నది.

"ఏమిటండీ పిచ్చిమాటలు? దాన్ని చంపుతారా ఏం? బుద్ధిమంతుడని ఇచ్చి దాని గొంతు కోసాం. ఏదయినా అయితే...." తల్లి మాటలు లావణ్యను మరింత అగాధంలోకి తోసాయి.

జబ్బుపేరుతో చంద్రశేఖరానికి దగ్గరయింది.

గోపాల్ బెడద యెలా వదిలించు కోవాలో అర్థంగాని స్థితి, గోపాలే సిటీకి వచ్చి విడాకులు ఇస్తానన్నాడు. లావణ్య చంద్రశేఖరాల ప్రేమకథ గోపికి తెల్సింది.

"మీరు .... మీరు నాతో ఒక్క మాటంటే, నా తమ్ముడు వచ్చి చెప్పే పరిస్థితి తప్పేది." అన్నాడు వెళ్ళిపోతూ.

లాయర్ ముందు ఇద్దరూ ఇష్ట పూర్వకంగా విడిపోతున్నట్టు వ్రాసుకుని సంతకాలు తీసుకున్నారు.

వారం తిరక్కుండానే తిరుపతిలో చంద్రశేఖరంతో తన వివాహం అయింది.

తండ్రి తప్ప అందరూ అనం దించారు.


నెలరోజులు హనీమూన్ పేరుతో హాయిగా దేశం తిరిగి వచ్చారు. చంద్ర శేఖరం జీవితం ఆమెకు చాలాచిత్రంగా తోచింది. అతనికి స్త్రీలతో స్నేహము, అది దాచిపెట్టాలని చూడడు. డబ్బున్న వాళ్ళకున్న అలవాట్లలో ఒకటిఅంటాడు. అతను తాగుతాడు. రేసులకు వెడతాడు. క్లబ్బులకు వెడతాడు. అతని దృష్టిలో భార్యంటే ఇంట్లో ఉన్న ఖరీదయిన వస్తువులలో ఒకటి. ఆమె ఇష్టాఇష్టాలతో అనుభూతులతో పనిలేదు.

లావణ్యకు ఏడ్చే అధికారంకూడా లేదు. ఏం తక్కువయిందని ఏడుస్తుంది? లోకందృష్టిలో అదృష్టవంతురాలు.

పుట్టింటికి వెళ్ళలేదు. తండ్రిచూపులు భరించలేదు. గోపాల్ ఆ ఊరు వదిలి వెళ్ళిపోయాడట. గండిపేట అవతల ఓ పల్లెటూర్లో డెయిరీ పెట్టుకున్నాడట.

ఆమె జీవితంలో మిగిలిన సజీవ మైన క్షణాలు ఏమయినా ఉన్నాయను కుంటే అవి గోపీతో గడిపిన జీవితమే. ఆ ఆరాధన, ఆ అల్లరి, అలక, అసలు యెలా మరిచిపోయింది.

రంగుల ప్రపంచంలోఉన్నా, ఆమెకు ఏ అనుభూతులూ లేవు. చంద్రశేఖరం తాగినప్పుడు వేరే స్త్రీ దొరకనప్పుడు అవసరానికి వస్తాడు అంతే. ఏమయినా




మాట్లాడుదామన్నా, అసలు అతనికి వీలు అవదు. రాత్రిపూట తాగిఉంటాడు. ఆ సమయంలో యెవరేం చెప్పినా వినడు.

తీపికి ఆశాచి బెల్లంపై వాలి, అతుక్కుపోతుంది ఈగ. అది తనకు మరణం అని తెలియదు.

అలాగే ఉంది లావణ్య మనస్థితి.

ఆ ఇంట్లో తనకు తోడు మరో ప్రాణి ఉంటే బావుండును అనుకుంది కాని చంద్రశేఖరానికి చాలా చిన్నవయసులో ఉన్న దుర్లవాట్లవల్ల, అతనికి సుఖ రోగాలు అంటుకున్నాయి. అతనికి పిల్లలు కలుగరని చెప్పారు. అది విన్న లావణ్య నిలువునా కృంగిపోయింది. ఆమెకు దాదాపు పిచ్చిపట్టినట్టుంది.

ఆమెకు గోపీని చూడాలన్న కోర్కె బలంగా నాటుకుపోయింది. యెలా వెళ్తుంది?

ఆ రోజు పత్రిక చదువుతుండగా, చంద్రశేఖరం గుమస్తా వచ్చాడు.

"ఏమిటి రామనాధంగారూ?"

"ఏంలేదమ్మా! రేపు మా అమ్మాయి పెళ్ళి. అయ్యగారు యెలానూ రారు. మీరువచ్చి ఆశీర్వదిస్తే సంతోషిస్తాను," అన్నాడు.

"అలాగే .... అలాగే వస్తానండి" అన్నది. ఆమెకు ఆ పంజరంలోనుండి బయటపడి రెండు నిముషాలు స్వేచ్ఛగా గాలి పీల్చుకోవాలనున్నది. చంద్ర శేఖరానికి పెళ్ళిళ్ళు, పేరంటాలు, సినిమాలు, షికార్లు అంటే పరమ ఎలర్జీ.

"కావాలంటే నువ్వెళ్ళు ...." అంటాడు.

ఒంటరిగా యెలా వెళ్తుంది! కొన్ని సార్లు రాణి, రామ్మోహన్‌తో వెళ్తుంది. యెప్పుడయినా తల్లి ఊరినుండి వస్తే వెళ్తుంది.

వీళ్ళంతా కొత్తవాళ్ళు! తన గతం తెలియనివాళ్ళు. వాళ్ళ యజమాని భార్యనని బాగా గౌరవిస్తారని తెలుసు.

వివాహస్థలం కాచిగూడా హనుమాన్ల గుడి అని వ్రాసిఉంది. పెళ్ళికూతురికో పట్టుచీర, జాకెట్టు తీసుకుంది. ఆరెంజి కలర్‌లో ఉన్న పట్టుచీర కట్టుకుంది. ఆమెకు చాలా ఉత్సాహంగా ఉంది. ఇన్నాళ్ళ ప్రవాసజీవితం వదలిపోతుంది. ఒక నాల్గుగంటలయినా హాయిగా గడిపి వస్తుంది.

కారు ఆగగానే రామనాధం యెదురు వచ్చాడు.

"అమ్మా .... వచ్చారా తల్లీ ...." ఆనందంగా, చిన్నకుర్రాడిలా సంబర పడ్డాడు. ఒకవైపు ఇరవైమంది స్త్రీలు కూర్చున్నారు. మరోవైపు యాభైమంది పురుషులు కూర్చున్నారు. అందరిలో తనకు కుర్చీ వేస్తానని వచ్చాడు రామనాధం.

"వద్దండీ, ఇక్కడ కూర్చుంటాను." నేలపైన పరిచిన జంఖానాలోకూర్చుంది.

రామనాధం సంబరంగా అందరికీ తనను చూపాడు.

"నిండుకుండ తొణకదు. చూడండి మా చంద్రశేఖరంగారి భార్య యెలా కూర్చుందో ...." అంటున్నాడు.

"పసుపు పూస్తానమ్మా," ఒకమ్మాయి పసుపుగిన్నెతో వచ్చింది.

"నువ్వు సతాయించి పుయ్యనక్కర లేదు. అమ్మగారి చీర పాడవుతుంది." రామనాధం భార్య కసురుకుంది.

"కాఫీ తీసుకోండి," రామనాధం చిన్నకూతురు కాఫీగ్లాసు తెచ్చింది. కాఫీ నోటిదగ్గర పెట్టుకుంది.

పెళ్ళిప్రమాణాలు వినిపించాయి. ఉలిక్కిపడింది.

రేపు విడిపోతుంటే ఈ కూర్చున్న జనాభాలో యెవ్వరూ అడ్డురారు. అనుకుంది.


అందరూ అక్షింతలు చల్లారు. అక్కడ ఉండాలనిపించలేదు. తనూ అక్షింతలు తీసుకుని లేచింది లావణ్య.

"ఈ చీర అక్కకు ఇవ్వమ్మా ...." పెళ్ళికూతురి చెల్లెలికి ఇవ్వబోయింది.

"మీరే ఇవ్వండమ్మా. మా సీత సంతోషిస్తుంది." రామనాధం అన్నాడు.

లావణ్య పందిరిదగ్గరకు వెళ్ళి అక్షంతలు చల్లబోయింది. అప్పుడే పెళ్ళికొడుకు ఇటు తిరిగాడు. అంతే, చెయి ఆగిపోయింది. ఆమె చేతిలోని పెట్టె జారిపోయింది.

వెనుకనుండి రామనాధం చిన్నకూతురు పట్టుకోకపోతే పడిపోయేది.




"ఏమయిందమ్మగారూ!"

"తల....తల తిరుగుతుంది....నేను ....వెళ్తాను...." అన్నది గిరుక్కున వెనుతిరిగి. రామనాధం యెంత వారిస్తున్నా వినక వెంబడి వచ్చాడు. ఆమె మనసు పరిపరి విధాలుగా పోతుంది.

"పెళ్ళికొడుకు మీకు బంధువా?"

"కాదమ్మా! మా తమ్ముడు, అతను పౌల్ట్రీ, డయిరీ పెట్టారు. ద్వితీయ వివాహమయినా అబ్బాయి చాలా మంచి వాడని, ఇద్దరు తమ్ములు చదువులయి ఉద్యోగాలలో ఉన్నారంట, బాధర బంధీ లేదంటే ఇచ్చాను. అసలు ఆయనపెళ్లే వద్దంటే తమ్ములిద్దరూ పట్టుబట్టిచేసారట. అన్న వివాహం కానిదే చేసుకో మన్నారట...."

అతను చెప్పేవి ఏవీ వినిపించలేదు. మరుపురాని మధురస్మృతులు ఆమెను చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరిచేస్తున్నాయి.

ఆమె గదిలోకి వెళ్ళాక అతను వెళ్ళిపొయ్యాడు.

అదే సమయాన అక్కడ నూతన దంపతులకు వడ్డించారు.

"సీతా! ఆవిడెవరు?" వరుడు అడిగాడు.

"యెవరూ?" సిగ్గుపడింది సీత అందరూ తమనే చూస్తున్నారని.

"పందిరి దగ్గర పడిపోబోయింది చూడు...."

"మా నాన్నగారు రిటైర్ అయ్యాక చంద్రశేఖరంగారని, కంట్రాక్టర్ దగ్గర పనిచేస్తున్నారు, వారి భార్య" అన్నది.

"అప్పుడే గుసగుసలు ప్రారంభించారా!" అని అందరూ ఎగతాళి చేసారు. వేణు, మధు అన్నదగ్గరకు వచ్చారు. వాళ్ళముఖంచూచి వాళ్ళెందుకు వచ్చారో అర్థం అయింది.

"నేనూ చూచాను, వెళ్ళి అందరిని చూచుకొండి." అన్నాడు. వాళ్ళు వెళ్ళి పోయారు.

నెలరోజుల తరువాత, సీత పువ్వులు తలలో తురుముకుంటూ గదిలోకి వచ్చింది.

"ఏమండీ! నేను చెప్పాను గుర్తుందా! మా నాన్నగారి బాస్ చంద్రశేఖరం అని, ఆయన భార్య లావణ్యకు మతి పోయిందిట...."

"సీతా!"

"అవునండీ! యెప్పుడూ మల్లెపందిరి కింద, బావిగట్టుమీద కూర్చుని తనలో తాను గొణుక్కుంటుందట...."

అతను బాధగా నిట్టూర్చాడు.

తమ వివాహమయిన కొత్తలో సరసాలకు స్థలాలు అవి. భర్త అలసి పోయాడేమో, అనవసర విషయాలు చెప్పాననుకుని, కళ్ళు మూసుకుంది, సీత లైటు ఆర్పి.

———